సాక్షి
సంగారెడ్డి
ఆదివారం । 19 । మే । 2024



శిక్షణ ఇస్తూ.. క్రీడల్లో రాణిస్తూ

మార్షల్ ఆర్ట్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు సోమక్కపేట గ్రామ యువకులు.

వివరాలు 8లో ▸



నెత్తురోడిన రహదారులు

ఉమ్మడి జిల్లాలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు.

వివరాలు 8లో ▸



కల్యాణం.. కమనీయం

మారేపల్లిలో లక్ష్మీనారాయణ స్వామివారి కల్యాణం కనులపండుగగా జరిగింది.

వివరాలు 9లో ▸

అహా నా ఇంటి పంట

'విల్లా'స భరితంగా మిద్దె సాగు



పచ్చదనంతో నిండిన ఓ విల్లా

- ఆసక్తి చూపుతున్న గేటెడ్ కమ్యూనిటీలు
- గృహ వ్యర్థాలే ఎరువుగా ఉపయోగం
- ఇంటి పంటలతో పచ్చదనం, ఆరోగ్యం

సండే స్పెషల్

ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు కొనాలంటే చాలామంది రైతుబజార్లు, మార్కెట్‌లకు వెళ్తుంటారు. అక్కడ ఉండే వాటిల్లో పురుగు మందులు, రసాయనాల వినియోగం, రోజుల తరబడి నిల్వ ఉంచడం ద్వారా తాజాదనం కోల్పోవడం తోపాటు రుచి కూడా తగ్గుతోంది. దానికి తోడు ధరలు కూడా భగ్గుమంటున్నాయి. ఇవన్నీ గమనించిన కొందరు ఆరోగ్య పరిరక్షణ కోసం ఇంటిలోనే కూరగాయలు పండించడం మొదలు పెట్టారు. ఇంటిమిద్దెలే పంట స్థలాలుగా మార్చుకుంటున్నారు. కుటుంబానికి కావాల్సిన పండ్లు, కూరగాయలు వారే పండించుకుంటున్నారు.

– వాగుల డేవిడ్‌రాజ్. పటాన్‌చెరు:

ఆధునిక యుగంలో బయట ఏది కొనాలన్నా వెనుకడుగు వేయాల్సి వస్తుంది. కూరగాయలు, పండ్లు తదితర ఉత్పత్తుల్లో రసాయనాల వాడకం ఎక్కువై పోయింది. వాటిని తినాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉంది. తప్పక తిని చాలామంది అనారోగ్యం కొనితెచ్చుకుంటున్నారు. కానీ కొందరు ఆరోగ్యం కోసం ఆర్గానిక్ పంటలపై ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ శివారు పటాన్‌చెరు నియోజకవర్గంలోని గేటెడ్ కమ్యూనిటీలు అధికంగా వెలుస్తున్నాయి. ఇక్కడ నివాసం ఉండేవారు తమ మిద్దెలనే సాగు అడ్డాలుగా మార్చుకుంటున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కూరగాయలు, పండ్లు, పూల చెట్లు పెంచుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఖాళీ సమయంలో వీటి పెంపకానికి ఎక్కువగా సమయాన్ని కేటాయిస్తున్నారు.

ప్రణాళిక ప్రధానం..

మిద్దె పంటలు పండించడం అంత సులువైన పని కాదు. చాలామంది ఆరంభ శూరత్వం ప్రదర్శిస్తుంటారు. కానీ కొందరు ప్రణాళికతో సాగు చేస్తుంటారు. అమీన్‌పూర్ పట్టణంలోని మోడీ కాలనీలో ఒక విల్లాలో సుబ్రహ్మణ్యంరెడ్డి ఆయన సతీమణి అనిత ఉంటున్నారు. వారు ఉంటున్న ఇంటిపై కూరగాయల సాగు మొదలు పెట్టారు. టమాట, వంకాయ, బెండ, చిక్కుడు. గోబీ, క్యాబేజీ తదితర కూరగాయలను పండిస్తున్నారు. కొత్తిమీర, పుదీనా అయితే వారింట్లో సంవత్సరం పొడవునా లభిస్తుంది. ఆ కుటుంబం కూరగాయల కోసం మార్కెట్‌కు వెళ్లింది చాలా తక్కువ. కొన్ని సీజన్‌లలో కూరగాయలు ఎక్కువ పండితే ఇరుగు పొరుగు వారికి కూడా పంచి పెడుతుంటారు.



మిద్దెపై కూరగాయలు, ఇతర మొక్కల కుండీలు

ఇంట్లోని చెత్తే ఎరువుగా..

ఇంట్లో వండే కూరగాయలతో వచ్చే వేస్టు, ఇతర చెత్తను రీసైకిల్ చేసి ఎరువుగా దాబాపై పెంచుతున్న మొక్కలకు వేస్తామని సుబ్రహ్మణ్యంరెడ్డి, అనిత దంపతులు చెబుతున్నారు. అలాగే సమీపంలోని బీరంగూడ గోశాల నుంచి ఆవుపేడతో పంచామృతాన్ని తయారు చేస్తామన్నారు. 165 గజాల స్థలంలోని ఇంటి వెనక సెట్ బ్యాక్‌గా వదిలిన ఐదు గజాల స్థలంలో ఎరువు తయారీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తడి చెత్తను రీసైకిల్ చేస్తున్నారు. పెట్టుబడి విషయానికి వస్తే ప్రారంభంలో పూల మొక్కల కుండీలు, ట్రేలు, ప్లాస్టిక్ కవర్లు, చెత్త రీసైక్లింగ్‌కు కావాల్సిన డ్రమ్ముల కొనుగోలుకు రూ.25 వేల వరకు ఖర్చు అయినట్లు తెలిపారు.

కొంచెం శ్రమిస్తే...

మిద్దె పంటకు అయ్యే ఖర్చును పక్కన పెడితే.. ఆరోగ్యం ఎంతో పదిలంగా ఉంటుంది. పురుగుమందులు, రసాయనిక ఎరువులు లేనటువంటి తాజా కూరగాయలను రోజూ తినొచ్చు. అందరూ ఇళ్లల్లో పంటలను సాగు చేసుకుంటే తడి చెత్తను బయట పారేయాల్సిన అవసరం కూడా ఉండదు. దానినే ఎరువుగా మార్చుకోవచ్చు.



వంకాయల చెట్లను చూపుతున్న అనిత



కరోనా సమయంలో ఎక్కువగా...

కరోనా విజృంభించిన సమయంలో ఇళ్లలో కూరగాయలు పండించే వారి సంఖ్య ఎక్కువైందని ఓ విత్తనాల వ్యాపారి చెప్పారు. ఆ సమయంలో మార్కెట్లో కూరగాయలు కొనడానికి ఇష్టపడలేదని, చాలామంది మిద్దెపై వాటిని పండించడం మొదలు పెట్టారని వివరించారు. రామచంద్రాపురంలో జాతీయ రహదారి పై 35 ఏళ్లగా ఎరువులు, విత్తనాలు పెస్టిసైడ్స్ ఇతర వ్యవసాయ పనిముట్లు విక్రయించే డిపో ప్రతినిధి ఒకరు సాక్షితో మాట్లాడారు. యూట్యూబ్ లో వీడియోలు చూసి చాలామంది గృహిణులు మిద్దెలు, ఇంటి ముందు ఖాళీ జాగాల్లో కూరగాయలు పెంచడం మొదలు పెట్టారని చెప్పారు. దీనికి పెద్దగా ఖర్చు కూడా ఏమీ కాదని ఆయన విశ్లేషించారు.

ట్రెండ్‌గా మారింది

అమీన్‌పూర్ మిద్దె పంటల సాగు ఒక ట్రెండ్‌గా మారింది. స్థానిక కౌన్సిలర్ ఒకరు తన కొత్త ఇంటి ముందు పూల మొక్కలకు బదులుగా వంకాయలు, ఇతర కూర పంటలు పండిస్తున్నారు. అలాగే పీఎస్ఆర్ కాలనీలో ఒకరిద్దరు ఖాళీ ప్లాట్లలో కాంపౌండ్ వాల్ కట్టి మరీ కూరగాయలను పండిస్తున్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలో గేటెడ్ కమ్యూనిటీల్లో 60 ఇళ్లల్లో ఇలా ఆర్గానిక్ కూరగాయలు సాగు చేస్తున్నారు. ఆర్సీపురం, తెల్లాపూర్, అమీన్‌పూర్, కిష్టారెడ్డిపేట ప్రాంతాల్లోని గేటెడ్ కమ్యూనిటీల్లో ఎక్కువగా మిద్దెలపై ఆర్గానిక్ కూరగాయలు పండిస్తున్నారు.

ఆరోగ్యంతో పాటు పచ్చదనం

ఇంట్లో పూలు, కూరగాయలు చెట్లను పెంచడం ద్వారా పచ్చదనం తోపాటు ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. చాలా కాలంగా పూల మొక్కలు ఇతర పచ్చని మొక్కలను పెంచే వాళ్లం. ప్రస్తుతం ఆరోగ్యం కోసం ఆర్గానిక్ కూరగాయలను సాగు చేస్తున్నాం. నా భర్త సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయినా తనకు సాగులో సాయం చేస్తుంటారు.


– అనిత, అమీన్‌పూర్

అన్నిట్లో రసాయనాలే..



ఏది తిందామన్నా... తాగుదామన్నా వాటిల్లో రసాయనాలే ఎక్కువగా ఉంటున్నాయి. అందుకే నా సతీమణి ఇంట్లోనే కష్టపడి కూరగాయలు సాగు చేస్తున్నారు. ఆర్గానిక్ పంటలు దొరకడం కష్టంగా ఉంది. ఇంట్లో పండించుకున్న కూరగాయలు తింటే ఆరోగ్యంగా ఉంటాం.

– సుబ్రహ్మణ్యంరెడ్డి, అమీన్ పూర్



ప్రయోజనాలు

- రసాయనాలు లేని కూరగాయలు
- సొంతంగా పండించుకునే వెసులుబాటు
- ఎండా కాలంలో ఇంటి పంటలతో 3–4 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గుదల
- ఇటు ఆరోగ్యం.. చల్లదనం
- ఆసక్తి చూపుతున్న గేటెడ్ కమ్యూనిటీలు
- పటాన్‌చెరు పరిధిలో 100కు పైగా మిద్దెలపై పంటలు

న్యూస్‌రీల్

అటవీ ప్రాంతాల పరిశీలన



వెంకటాపూర్ నర్సరీని పరిశీలిస్తున్న డీఎఫ్ఓ శ్రీధర్‌రావు

నారాయణఖేడ్: అడవుల పరిస్థితిపై జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్ఓ) శ్రీధర్‌రావు శనివారం ఆరా తీశారు. నారాయణఖేడ్ రేంజి పరిధిలోని కడ్పల్, వెంకటాపూర్, బోరంచ, సిర్గాపూర్, నాగ్‌ధర్, తడ్కల్, కంగ్టి తదితర ప్రాంతాల్లోని అటవీ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అడవుల్లో చిరుతపులి, ఇతర జంతువుల సంచారం గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నర్సరీల్లో కొనసాగుతున్న మొక్కల పెంపకాన్ని, విత్తన శుద్ధిని ఆయన పరిశీలించారు. అటవీశాఖ అధికారులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు.

విపత్తులను తట్టుకునే వంగడాలు అవసరం



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

ములుగు(గజ్వేల్): విపత్కర పరిస్థితులను తట్టుకునే వంగడాలు, రకాలు ఆధునిక సాంకేతిక పద్ధతులు రూపొందించేందుకు విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు కృషి చేయాలని రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ కె.అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం ములుగులోని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశానికి ముఖ్యతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఉద్యాన పంటల సాగు ద్వారా రైతులకు రెట్టింపు ఆదాయం లభిస్తుందన్నారు. వాటిని సాగు చేసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రోత్సహించాలని అధికారులకు, విస్తరణాధికారులకు సూచించారు. అనంతరం వివిధ పరిశోధనా సంస్థలు రూపొందించిన ఉద్యాన పంటల సమాచారాన్ని బ్రోచర్‌లను అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్.బి.నీరజప్రభాకర్, వర్సిటీ, ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతు వెంకన్న పాల్గొన్నారు.



లలితా సహస్ర నామాలను పఠిస్తున్న మహిళలు

ఘనంగా వాసవీకన్యకా పరమేశ్వరి జయంతి



జహీరాబాద్ టౌన్: పట్టణంలో వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో శనివారం ప్రత్యేక అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు సామూహిక లలిత సహస్ర నామాలను పఠించారు. అనంతరం అమ్మవారి డోలా రోహణం, మహా హారతి ఇచ్చారు. భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షకార్యదర్శులు బెజుగం రాజ్‌గోపాల్, నామ రవికిరణ్ గుప్త, నాయకులు అల్లాడి వీరేశం, బెజుగం సత్యనారాయణ, బాలచందర్, శ్రీనివాస్, కల్పన, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి టౌన్: పట్టణంలో వాసవి మహాసంస్థాన్ ఆధ్వర్యంలో శనివారం వాసవీ మాత జయంతి వేడుకలను వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీని ఆలయ కమిటీ చైర్మన్ అనంత కిషన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పల్లకీ సేవ, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● ఆరోగ్యమే మహాభాగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న భెల్ జీఎం శ్రీనివాస్ రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం మాస్ ఫిట్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భెల్ జీఎం హెచ్ఆర్ శ్రీనివాస్‌రావు, జీఎం చంద్రశేఖర్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారుల అభివృద్ధికి భెల్ యాజమాన్యం కృషి చేస్తుందని వివరించారు. ప్రతి ఏటా బెల్ కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపును నిర్వహించడం సంతోషకరమన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. చిన్నారులకు వారికి నచ్చిన క్రీడల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ ప్రధాన శ్రీకాంత్, సీనియర్ మేనేజర్ మాయ బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజీతో కేసులు సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న భవానీ చంద్ర

సంగారెడ్డి టౌన్: రాజీమార్గంలో కేసులు తొందరగా పరిష్కారం చేసుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర సూచించారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో ఆమె మాట్లాడుతూ.. జూన్ 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. క్రిమినల్ కాంపౌండ్, ఎక్సైజ్, డ్రంకెన్‌డ్రైవ్, భూ తగాదాలు, ఇన్సూరెన్స్ తదితర కేసులను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

జహీరాబాద్: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.సూరికృష్ణ సూచించారు. శనివారం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, బ్యాంకు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, రాజీమార్గంలో కేసులు సత్వర పరిష్కారమయ్యేలా చూడాలని తెలిపారు. బ్యాంకు అధికారులు దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీని, సంబంధిత శాఖ అధికారులను సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, న్యాయవాదులు సోమశేఖర్, జగన్, బ్యాంకు అధికారులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

● ఉల్లాసంగా.. ఉత్సాహంగా



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్ సంజీవ్‌రావు తదితరులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అల్లీపూర్ గార్డెన్ నగర్‌లో మెథోడిస్ట్ 94వ క్రైస్తవ ఉజ్జీవ సభల జాతర ఉత్సవాలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు శనివారం మెథోడిస్టు చర్చి ప్రాంగణం జాతరకు వచ్చిన జనంతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలను మెథోడిస్టు చర్చి డీఎస్ సంజీవ్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా లేలీడర్ సరీన్ జాన్, సెక్రటరీ రవికుమార్, నిర్వాహకులు నవీన్‌కుమార్, పాస్టర్లు రాజ్ కుమార్, జోనా, సందీప్, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం దైవధ్యానం, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భజన పోటీలు, బుర్రకథ, ఏసుక్రీస్తు జీవిత చరిత్ర చలన చిత్రప్రదర్శన చేపట్టారు. విశాల ప్రాంగణంలో వెలసిన రంగులరాట్నం, ఆటల వస్తువులు, ఎగ్జిబిషన్‌లో పిల్లలు సందడి చేశారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ

- మే 24 నుంచి జూన్ 3 వరకు పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ

సంగారెడ్డి టౌన్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. మే 24 నుంచి జూన్ 3వరకు జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని చెప్పారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోవాలని, సెంటర్ల సమీపంలో 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. ఫస్టియర్ పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, సెకండియర్ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నేటి నుంచి విద్యార్థులు హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో పొందవచ్చని తెలిపారు.

31 పరీక్షా కేంద్రాలు

పరీక్షల నిర్వహణకు జిల్లా పరిధిలో 31 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 14,886 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో మొదటి సంవత్సరం 9318 మంది, ఒకేషనల్ 599మంది, రెండవ సంవత్సరం 4646 మంది, ఒకేషనల్ 323 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కన్వీనర్ గా గల ఐదుగురు సభ్యులతో కూడిన జిల్లా పరీక్షల కమిటీ హైపవర్ కమిటీ ఈ పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తుందన్నారు. మాల్ ప్రాక్టీస్‌ను అరికట్టేందుకు రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు.

గ్రూప్–1 ప్రిలిమినరీకి ఏర్పాట్లు

సంగారెడ్డి టౌన్: జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం. మహేందర్ రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 9672 మంది గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష రాయనున్నారని, వారి కోసం 37 పరీక్షా కేంద్రాలు సిద్ధం చేశామని తెలిపారు. లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్ల పర్యవేక్షణలో పరీక్ష కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ యంత్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఏఓ పరమేష్, అధికారులు పాల్గొన్నారు.

● రోడ్డెక్కిన రైతన్న



మెదక్–జోగిపేట రహదారిపై రైతుల ధర్నా

కొల్చారం(నర్సాపూర్): రోజుల తరబడి తూకం వేయకపోవడం, వేసినా రవాణాలో ఇబ్బందులు తలెత్తుతుండడంతో ఆగ్రహించిన రైతులు మండలంలోని ఎనగండ్ల పంచాయతీ దుంపలకుంట చౌరస్తాలో శనివారం ధర్నాకు దిగారు. అధికారులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడికి చేరుకున్న ఎస్ఐ మహ్మద్‌గౌస్ రైతులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించిన వినలేదు. గంట పాటు సాగిన రాస్తారోకోతో రహదారికి ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న తహసీల్దార్ రైతుల వద్దకు వచ్చి మాట్లాడారు. ఇబ్బంది తలెత్తకుండా చూస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం ఆయన తూకం వేగవంతం చేయాలని కొనుగోలు కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. సమీపంలోని రైస్‌మిల్లులకు వెళ్లి ధాన్యం బస్తాలతో వచ్చిన లారీలను వెంట వెంటనే ఖాళీ చేసి కొనుగోలు కేంద్రాలకు పంపాలని యజమానులను ఆదేశించారు.

క్లుప్తంగా

చాముండేశ్వరీ సన్నిధిలో హైకోర్టు జడ్జి


ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న హైకోర్టు జడ్జి శ్రీనివాసరావు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చిట్కుల్ గ్రామ సమీపంలో గల శ్రీచాముండేశ్వరీ దేవిని శనివారం హైకోర్టు జడ్జి శ్రీనివాసరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. చాముండేశ్వరీదేవి ఆలయానికి హైకోర్టు జడ్జి రావడంతో అర్చకుల ప్రభాకర్ శర్మ, సుబ్రమణ్య శర్మ, మోతీలాల్ శర్మ స్వాగతం పలికారు. జడ్జి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. హైకోర్టు జడ్జి వెంట నర్సాపూర్ కోర్టు సివిల్ జడ్జి అనిత, స్థానిక ఎస్ఐ శేక్ మహబూబ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

అయిట రాష్ట్ర అధ్యక్షుడు యాఖినొద్దీన్


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు మంచి లక్ష్యం నిర్దేశించుకొని లక్ష్యం వైపునకు ముందుకు సాగాలని అయిట రాష్ట్ర అధ్యక్షుడు యాఖినొద్దీన్ అన్నారు. ఆల్ ఇండియా ఐడల్ టీచర్స్ అసోసియేషన్ (అయిట) ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో పదవ తరగతి, ఇంటర్మీడియేట్‌లలో రాణించిన ముస్లిం విద్యార్థులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలతోపాటు నగదును అందించారు. ఈ సందర్భంగా యాఖినొద్దీన్ మాట్లాడుతూ.. జీవితంలో ఎదగాలంటే ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ఉపాధ్యాయుల దిశా నిర్దేశంలో ఉజ్వల భవిష్యత్‌లో అడుగు పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు ఇబ్రహీం, జుబేర్, అయిట సంస్థ మీడియా కో ఆర్డినేటర్ నసీరుద్దీన్, అబ్దుల్ ఖుద్దుస్, కమాల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో డ్రైవర్

ఫౌంటేన్ ఎక్కిన లారీ..


ఫౌంటేన్‌లోకి చొచ్చుకెళ్లిన లారీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడపడంతో లారీ ఫౌంటేన్ ఎక్కింది. ఈ ఘటన శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. కోదాడకు చెందిన లారీ డ్రైవర్ సరుకుల లోడ్‌ను అన్‌లోడ్ చేసి తిరిగి కోదాడకు వెళ్తున్నాడు. మధ్యాహ్నం సిద్దిపేట బీజేఆర్ చౌరస్తా వద్దకు రాగానే అతివేగంతో, అజాగ్రత్తగా లారీని నడుపుకుంటూ వచ్చి ఫౌంటెయిన్ ఎక్కించాడు. ఆ సమయంలో లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

పిచ్చి కుక్క వీర విహారం

నలుగురికి తీవ్రగాయాలు


గాయపడ్డ చిన్నారి

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డిలో శనివారం వీధి కుక్క వీర విహారం చేసింది. ఒకే గ్రామంలో ఏకంగా నలుగురిపై దాడి చేసింది. గ్రామంలోని దళితవాడకు చెందిన చిన్నారులు లైని కార్తీక్, అలిగె అన్విక, మరో ఇద్దరు గ్రామస్తుల ముక్కు, చెంపలపై గాయాలయ్యాయి. క్షతగాత్రులు చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పిచ్చి కుక్క దాడి చేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే కుక్కలను పట్టుకొని తరలించాలని అధికారులను కోరారు.

శిక్షణ ఇస్తూ.. క్రీడల్లో రాణిస్తూ

- కరాటేలో రాణిస్తున్న సోమక్కపేట్ యువకులు
- జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు
- పాఠశాలల్లో విద్యార్థులకు, గ్రామీణ యువతకు శిక్షణ


పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న మురళీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రస్తుత పరిస్థితుల్లో ఆత్మరక్షణ అవసరమని, కనీసం మనల్ని మన రక్షించుకునే సామర్థ్యం అయినా ఉండాలనే ఇద్దరు యువకులు సరదాగా నేర్చుకునేందుకు మొదలుపెట్టిన మార్షల్ ఆర్ట్స్, ప్రస్తుతం మరికొందరు యువకులకు నేర్పించే శిక్షకులుగా మారారు. కేవలం మార్షల్ ఆర్ట్స్ మాత్రమే తమ ప్రాణం అంటూ జాతీయ స్థాయి పోటీల్లో ఎన్నో పతకాలు సాధిస్తున్నారు చిలప్‌చెడ్ మండలంలోని సోమక్కపేట్ గ్రామానికి చెందిన గొల్ల మల్లేశం, బెస్త మురళీ.


కరాటేలో మల్లేశం విన్యాసాలు

ఆరుసార్లు మొదటి స్థానంలో..

2007లో కరాటేలో ఆరంగ్రేటం చేసిన మురళీ బ్లాక్‌బెల్ట్–2లో డిగ్రీ పూర్తి చేశారు. ఇప్పటి వరకు 10 సార్లు జాతీయ స్థాయిలో పాల్గొని, 6 సార్లు మొదటి స్థానంలో నిలిచాడు. 2017–18లో మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నారు. కిక్ బాక్సింగ్‌లో సైతం ఆరంగేట్రం చేసిన మురళీ రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడు సార్లు పతకాలు సాధించారు.

ప్రస్తుతం శిక్షకులు

రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు సాధించిన వీరు ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు, కరాటేపై ఆసక్తి ఉన్న గ్రామీణ యువతకు శిక్షణ ఇస్తున్నారు. అదే విధంగా వారు శిక్షణ ఇచ్చిన విద్యార్థులు, యువకులు సైతం మండల, జిల్లా స్థాయిలో రాణించి, పతకాలు, పురస్కారాలు పొందిన వారు వందల సంఖ్యలో ఉన్నారు. సరదాగా మొదలుపెట్టిన మార్షల్ ఆర్ట్స్‌లో ఎంతగా రాణించినా ప్రభుత్వం మాత్రం వారిని గుర్తించడం లేదు. మార్షల్ ఆర్ట్స్, కిక్ బాక్సింగ్‌లో ఎంత ప్రతిభ ఉన్నా ప్రస్తుతం వారు గ్రామానికి పరిమితమై, వ్యవసాయ పనులు చూసుకుంటూ, వారు నేర్చుకున్న ప్రతిభను విద్యార్థులకు, యువకులు నేర్పుతున్నారు.

జాతీయ స్థాయికి ఏడుసార్లు..

కరాటేతోపాటు కిక్ బాక్సింగ్‌లో రంగప్రవేశం చేసిన మల్లేశం ఎన్నో అవార్డులు గెలుపొందారు. రెండింటిలోనూ బ్లాక్ బెల్ట్–2 డిగ్రీ సాధించారు. ఇప్పటి వరకు మల్లేశం రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఏడు సార్లు పాల్గొని, అన్నింటిలోనూ విజయం సాధించి పతకాలు అందుకున్నారు. 2017 మహారాష్ట్రలో జరిగిన కరాటే జాతీయ స్థాయి 50 కిలోల విభాగంలో పాల్గొని మొదటి స్థానంలో నిలిచారు.

ఆర్మీపై ఆసక్తితో కరాటే



చిన్నప్పటి నుంచి ఆర్మీలో చేరాలని ఆసక్తి, అందుకే సరదాగా నేర్చుకున్న కరాటే తమ లక్ష్యాన్ని మార్చేసింది. యుద్ధ విద్యలో రాణిస్తూ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా ఎంతగానో గుర్తింపు సాధించాను. ప్రస్తుతం గ్రామంలోనే యువతకు శిక్షణ ఇస్తున్నాను. ప్రభుత్వం ఇతర క్రీడలకు ఇచ్చిన గుర్తింపు మార్షల్ ఆర్ట్స్, కిక్ బాక్సింగ్‌లకు ఇవ్వాలి.

– మల్లేశం, సోమక్కపేట

అంతర్జాతీయ స్థాయికి వెళ్లాలి



మార్షల్ ఆర్ట్స్, కిక్ బాక్సింగ్‌లో రాణించాను. జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం గెలుపొందడంతో అంతర్జాతీయ స్థాయికి వెళ్లే దిశగా కృషి చేస్తున్నాను. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినా ప్రభుత్వం మాత్రం గుర్తించడం లేదు. ఆసియాలోని పలు దేశాలలో మార్షల్ ఆర్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, ఇండియాలో అంతగా పట్టించుకోకపోవడం బాధాకరం.

– మురళీ, సోమక్కపేట

ఈఏపీ సెట్‌లో విద్యార్థుల సత్తా


రామకృష్ణ


షెట్కార్ శ్రీకర్

నారాయణఖేడ్: ఈఏపీసెట్ ఫలితాలు శనివారం విడుదలకాగా నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన ఇద్దరు విద్యార్థులు మంచి ర్యాంకులతో సత్తాచాటారు. ఖేడ్ పట్టణానికి చెందిన అన్నలదేశీ రామకృష్ణ 1,139వ ర్యాంకును, షెట్కార్ శ్రీకర్ 8,544వ ర్యాంకును సాధించారు. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో తాము మంచి ర్యాంకులు సాధించామని తెలిపారు. బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ఉన్నతస్థాయికి ఎదగడమే తన జీవిత లక్ష్యమని వారు తెలిపారు. ఖేడ్ పట్టణ విద్యావంతులు, పద్మశాలీ సంఘ బాధ్యులు వారిని ప్రత్యేకంగా అభినందించారు.

సంగారెడ్డి విద్యార్థుల సత్తా

కొండాపూర్(సంగారెడ్డి): ఈఏపీసెట్ ఫలితాల్లో సంగారెడ్డిలోని రాయల్ జూనియర్ కళాశాల విద్యార్థి శ్రీ వైష్ణవి మెడిసిన్ భాగంలో 1015 ర్యాంకు సాధించింది. రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడంపై కళాశాల ప్రిన్సిపాల్ కృపానిధి హర్షం వ్యక్తం చేశారు. సంగారెడ్డి పట్టణంలోని అక్షయ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంజనీరింగ్ విభాగంలో వంశీ కృష్ణ 2,086 ర్యాంకు, అగ్రికల్చర్ విభాగంలో పూజిత 2,383 వ ర్యాంకు సాధించారు. అదే విధంగా ఇంజనీరింగ్ విభాగంలో వివేక్ 4,230, నిమ్మి జేమ్స్ 9,568, అగ్రికల్చర్ విభాగంలో హరిణి 5905 ర్యాంకు సాధించారు.


శ్రీ వైష్ణవి

గిరిజన విద్యార్థికి 1, 670 ర్యాంకు


మోహన్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ గిరిజన బాలుర ప్రతిభా కళాశాల విద్యార్థి ఏ.మోహన్ శనివారం విడుదల చేసిన ఈఏపీసెట్ ఫలితాల్లో 1,670 ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపాల్ విజయరామిరెడ్డి తెలిపారు. కళాశాలలో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 15 మంది విద్యార్థులు హాజరుకాగా అందరూ అర్హత సాధించారు. ఎంపీసీ విభాగంలో 24 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగ జె.వీరన్న 25,996 ర్యాంకు సాధించగా మిగితా విద్యార్థులు అర్హత సాధించినట్లు చెప్పారు.

బెస్ట్ ఇంజనీర్ అవుతా

ఈఏపీ సెట్ 159వ ర్యాంకర్ ఉప్పల ప్రజిన్


ఉప్పల ప్రజిన్

చేర్యాల(సిద్దిపేట): గొప్ప ఇంజినీర్ కావాలన్నదే తన లక్ష్యమని సాక్షితో ఎంసెట్‌లో 159వ ర్యాంకు సాధించిన ఉప్పల ప్రజిన్ తెలిపారు. నారాయణలో ఇంటర్ పూర్తి చేసి ఈఏపీసెట్ రాశారు. శనివారం విడుదలైన ఈఏపీసెట్ ఫలితాల్లో 159వ ర్యాంకు సాధించారు. కాగా, పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉప్పల ప్రేమ్‌కుమార్, శ్రీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దబ్బాయి శ్రీవాత్సవ్ మెడిసిన్ చదువుతుండగా, చిన్నబ్బాయి ఉప్పల ప్రజిన్. ర్యాంకు సాధించిన అతడిని తోటి విద్యార్థులు, అధ్యాపకులు అభినందించారు. ఎంసెట్‌లో మంచి ర్యాంకు రావడం సంతోషంగా ఉందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

నెత్తురోడిన రహదారులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 14 మందికి గాయాలు

సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో శనివారం పలు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. సదాశివపేటలో టెంపో బోల్తాపడి తొమ్మిది మంది, కొండపాకలో విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టడంతో నలుగురు, రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు గాయాలపాలయ్యారు. పటాన్‌చెరులో బైక్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు.

టెంపో వాహనం బోల్తా

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): టెంపో ట్రావెల్ వాహనం బోల్తా పడి తొమ్మిది మందికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన శనివారం మండల పరిధిలోని ఆరూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శ్రేయస్ ముఖతి అతడి కుటుంబ సభ్యులు కలిసి టెంపో ట్రావెల్ బస్సులో శ్రీశైలం, తిరుపతి వెళ్తున్నారు. డ్రైవర్ పాల్ భగవత్ వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్త నడపడంతో జాతీయ రహదారి ఆరూర్ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శ్రేయస్ ముఖతి, అతడి భార్య ప్రేరణతో సహా తొమ్మిది మందికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

కొండపాక(గజ్వేల్): విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొని బోల్తా పడటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కుకునూరుపల్లిలో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు నౌషిన్, మన్సూర్, మసూద్ అలీతోపాటు మూడేళ్ల పాప సిద్దిపేటలోని బంధువుల ఇంట్లో శుక్రవారం జరిగిన శుభకార్యానికి వచ్చారు. శనివారం తెల్లవారు జామున తిరిగి సంగారెడ్డికి వెళ్తున్న క్రమంలో కారు అదుపుతప్పి డివైడర్ మధ్యలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, మూడేళ్ల పాపకు ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్సు సిబ్బంది మహేందర్, శ్రీనివాస్ హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని క్షత గాత్రులను గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని కారును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మరో ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన కొండపాక మండలంలోని దుద్దెడ శివారులో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దుద్దెడలోని తుర్క కాశనగర్‌కు చెందిన కమల్ బైక్‌పై టోల్ ప్లాజా నుంచి దుద్దెడకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చిన్న కోడూర్ గ్రామానికి చెందిన పరుశరామ్‌తోపాటు మరొకరు వెలికట్ట క్రాస్ రోడ్డు నుంచి సిద్దిపేట వైపునకు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కమల్, పరుశరామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్ : ద్విచక్రవాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్ఐ ఆసిఫ్ అలీ కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ముత్తంగి వైపు నుంచి రుద్రారానికి బైక్ పై వెళ్తున్న ఓ వ్యక్తి ఇస్నాపూర్ సమీపంలోకి రాగానే నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి (35 నుంచి 40 ఏళ్లు)ని శుక్రవారం అర్ధరాత్రి ఢీకొట్టాడు. తీవ్ర గాయాలై గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సొంత భవనాలు కరువు

- మహిళా సమాఖ్యలకు తప్పనితిప్పలు
- చెట్ల కిందే సమావేశాలు
- జిల్లాలో 18,191 స్వయం సహాయక సంఘాలు
- త్వరగా నిర్మించాలంటున్న సభ్యులు


కందిలో చావిడి వద్ద సమావేశం నిర్వహిస్తున్న డ్వాక్రా గ్రూపు సభ్యులు

కంది(సంగారెడ్డి): జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు సొంత భవనాలు కరువయ్యాయి. సంఘాల సభ్యులు ప్రతి నెలా సమావేశాలు నిర్వహించుకొని సంఘాల పనితీరు, ఆర్థిక లావాదేవీలపై చర్చించుకుంటారు. ఈ క్రమంలో సొంత భవనాలు లేక సమావేశాలను ఇళ్ల ఎదుట, చెట్ల కింద నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళా సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 18,191 స్వయం సహాయక సంఘాలు ఉండగా లక్షా 90 వేల మంది సభ్యులు ఉన్నారు. మండల సమాఖ్యలు 25 ఉండగా 695 గ్రామైఖ్య సంఘాలున్నాయి. కొత్తగా ఏర్పడిన మండలాలైన కంది, నాగల్‌గిద్ద, మొగుడంపల్లి, వట్‌పల్లి, నిజాంపేట, చౌటకూరు, గుమ్మడిదల, సిర్గాపూర్ తదితర మండలాల్లో మండల సమాఖ్య భవనాలు లేవు. జిల్లాలో అక్కడక్కడ నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాల్లో ఒక గదిని గ్రామ సమాఖ్యలకు కేటాయించారు. అయినా ఇప్పటికీ సుమారు 80 శాతం గ్రామ సమాఖ్యలకు భవనాలు లేవు.

నిధులు మంజూరైనా..

పలు మండలాల్లో సమాఖ్య భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదు. నిర్మాణంలో ఉన్న భవనాల పనులను పూర్తి చేయకపోవడంతో వాటిని వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిర్మాణంలో ఉన్న భవనాల పనులను పూర్తి చేయించాలని కోరుతున్నారు.

భవనాలు లేక ఇబ్బందులు



కందిలో మండల స్థాయి స్వయం సహాయక సంఘాల సమావేశాలు నిర్వహించుకునేందుకు భవనం లేక ఇబ్బంది పడుతున్నాం. 12 ఏళ్ల నుంచి సంగారెడ్డిలోని జిల్లా సమాఖ్య భవనంలోనే మండల సమాఖ్య నడుస్తోంది. మండల కేంద్రమైన కందిలో భవనం నిర్మిస్తే బాగుటుంది.

– వజనా, కంది మండల సమాఖ్య అధ్యక్షురాలు

త్వరగా నిర్మిస్తే మేలు



గ్రామ సమాఖ్య భవనాలు లేకపోవడంతో సభ్యుల ఇళ్ల ఎదుట, చెట్ల కింద, గ్రామ చావిడి వద్ద సమావేశాలను నిర్వహిస్తున్నాం. వర్షాకాలంలో అయితే చాలా ఇబ్బందులు పడుతున్నాం. గ్రామ సమాఖ్య భవనం నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుంది. త్వరగా నిర్మించాలని కోరుతున్నాం.

– రుక్మిణి, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయండి

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలక్రిష్ణ

పాపన్నపేట(మెదక్): దుబ్బుల కొలుపు కళాకారులకు ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లెల్లేల బాలక్రిష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఏడుపాయల్లో దుబ్బుల కొలుపు కళాకారులతో కలసి మహాకొలుపు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వందలాది కళాకారులు వృత్తి వస్త్రాలు ధరించి, వాయిద్య పరికరాలతో, డప్పులు, కొమ్ములు, చేతబూని దుర్గమ్మ, పోతరాజులు వేశాలతో మహాకొలుపు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలక్రిష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కొలుపు వృత్తి కళను తెలంగాణ సాంస్కృతిక శాఖలో భాగంగా గుర్తించాలని కోరారు. కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, నైపుణ్యాలు పెంపొందించేందుకు శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయాలని, ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.10 లక్షల ఉచిత బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కళాకారులందరికీ నెలకు రూ.5 వేల పింఛన్, సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో దుబ్బుల కొలుపు రాష్ట్ర యూనియన్ కోశాధికారి బోగిరి ఆనంద్, జనగారి లక్ష్మణ్, సంపత్, గిరుగుల సమ్మయ్య, రవీందర్, బామిని రాజ్ కుమార్, నాందేవ్, జునగరి నారాయణ, రాజ్‌కుమార్, కళాకారులు పాల్గొన్నారు.



మహాకొలుపులో కళాకారులు

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి


మృతి చెందిన పాడి గేదె

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పెద్దకోడూరు శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన చిట్టి శ్రీనివాస్ రెడ్డి పశువులను రోజు మాదిరిగా తన పొలం వద్ద మేపుతున్నాడు. విద్యుత్ వైరు తెగి కిందపడి గేదెకు తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.70 వేల విలువ గల పాడి గేదె మృతి చెందడంతో రైతు బోరున విలపించాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.

విద్యుత్ శాఖ వైఫల్యం వల్లే..

పెద్దకోడూరు శివారులో వారం కిందట కురిసిన ఈదురు గాలుల వర్షానికి విద్యుత్ వైర్లు తెగిపడిపోయాయి. రైతులు ఈ విషయాన్ని విద్యుత్ అధికారులకు సమాచారం అందించినా సరి చేయలేదు. అధికారుల నిర్లక్ష్యం వల్ల తన పాడి గేదె మృతి చెందిందని రైతులు పేర్కొన్నారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యంతో పోలీసులు

సిద్దిపేటఅర్బన్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట చుట్టు పక్కల గ్రామాల నుంచి రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు, త్రీటౌన్ పోలీసులు రాజీవ్ రహదారిపై కాపుకాసి 140 క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్న డీసీఎంను పట్టుకున్నారు. హుజూరాబాద్ మండలం శాలపల్లికి చెందిన గద్దల రవివర్మ, నాగరాజు, తిరుపతి, శ్రీను మరో ఇద్దరు కలిసి వరంగల్, సిద్దిపేట పరిసర ప్రాంతాల్లో సేకరిస్తూ ఎక్కువ ధరలకు అమ్ముకుంటున్నారని తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

40 క్వింటాళ్లు స్వాధీనం

దుబ్బాకరూరల్: మండలంలోని చీకోడ్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు, దుబ్బాక పోలీసులు పట్టుకున్నారు. గ్రామంలోని గురుపాదం అనే వ్యక్తి ఇంటిలో ఎలాంటి అనుమతి లేకుండా 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గంగరాజ్ తెలిపారు.

107 ఏళ్ల వృద్ధురాలు మృతి


సిరా గుర్తు చూపుతున్న గెండవ్వ

దుబ్బాక : దౌల్తాబాద్ మండలం సూరంపల్లికి చెందిన సోమన్నగారి గెండవ్వ(107) శనివారం కన్నుమూశారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో (హోమ్ పోలింగ్) ఎంతో హుషారుగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మే 2న తన ఇంటి నుంచే ఓటు వేసి 107 ఏళ్ల వయస్సులో అందరికీ ఆదర్శంగా నిలిచారు. గెండవ్వకు కుమారుడు మనవలు, మనువరాళ్లు మొత్తం 36 మంది ఆ కుటుంబంలో ఉన్నారు. శతాధిక వృద్ధురాలు గెడవ్వ మృతితో సూరంపల్లిలో విషాదచాయలు నెలకొన్నాయి.

ఇంటి నుంచి వెళ్లి.. మంజీరాలో శవమై తేలి

కొల్చారం(నర్సాపూర్): ఇంట్లో గొడవల కారణంగా బయటకు వెళ్లిన మహిళ మూడు రోజుల తర్వాత మంజీరా నదిలో శవమై తేలిన ఘటన మండలంలోని పోతంశెట్టిపల్లి శివారులో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. మెదక్ పట్టణం నవాబుపేట గల్లీకి చెందిన కోర రాజయ్య భార్య కోర సుజాత (41) ఈనెల 16వ తేదీన తల్లి రాజమ్మతో కుటుంబ, ఆర్థిక విషయంలో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో 17న మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోతంశెట్టిపల్లి శివారు ఏడుపాయలకు వెళ్లే మొదటి బ్రిడ్జి మంజీరాలో మహిళ మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి సుజాతగా నిర్ధారించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.